సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 20 । నవంబర్ । 2024



ఉత్సాహంగా స్విమ్మింగ్ ఎంపికలు

డాక్టర్ వైఎస్సార్ క్రీడాపాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. -8లో



పనులొదిలేసి వెళ్లకపోతే ప్రాణాలుండవ్

అనకాపల్లి బీజేపీ ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కాంట్రాక్టు సంస్థ పనులను అదే పార్టీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.0/21.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం 21.8 – 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తిరుపతి-చెన్నై బస్సు సర్వీసు ప్రారంభం

జమ్మలమడుగు: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి మీదుగా చెన్నైకు నూతన బస్సు సర్వీసు ప్రారంభమైంది. మంగళవారం ఉదయం డిపో మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తు తం చెన్నైకు నెల్లూరు-సూళ్లురుపేట మీదుగా బస్సు సర్వీసు నడుస్తోందన్నారు. అదనంగా తిరుపతి మీదుగా చెన్నైకు ప్రతిరోజు బస్సు సర్వీసు ఉంటుందన్నారు. ఈ సర్వీసులు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శబరిమలకు మరో ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం కడప మీదుగా మరో ప్రత్యేక రైలును నడపుతున్నట్లు కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07147/48 నెంబరుగల రైలు మచిలీపట్నంలో మధ్యాహ్నం 12.00 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 9.20 గంటలకు కొల్లం చేరుతుందన్నారు. ఈ రైలు గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురంరోడ్డు, కంభం, గిద్దలూరు,నంద్యాల, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా కొల్లాం వెళుతుందన్నారు. ఈ రైలు డిసెంబరు 23, 30 తేదీలలో మచిలీపట్నం నుంచి, డిసెంబరు 25, జనవరి 1 తేదీలలో కొల్లం నుంచి బయలుదేరుతుందని వివరించారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు అర్హత గల వైఎస్సార్ జిల్లా వాసులకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కడప బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కృష్ణయ్య తెలిపారు. అర్హతగలవారు ఈనెల 24వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్ వైఎస్సార్ కడప కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అలాగే ఈనెల 27వ తేదిన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని, అందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. దరఖాస్తుచేసే అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు విద్యా, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేసి ఏపీ బీసీ స్టడీ సర్కిల్, పాత రిమ్స్, కడప అనే చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. ఇతర వివరాలకు నేరుగా కార్యాలయంలో లేదా 98499 19221,99664 18572 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ..

కడప ఎడ్యుకేషన్: సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఏక్యూ టెక్నాలజీస్ నిర్వాహకులు అమీర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అజూర్, సేల్స్‌ఫోర్స్, ఫుల్ ట్రాక్, ఎస్ఏపీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొన్నటి వరకు ఇలాంటి కోర్సుల కోసం హైదరాబాదు, బెంగుళూరు తదితర సిటీలకు వెళ్లేవారని.. ఇప్పుడు ఆ అవసరం లేకుండానే కడపలోనే తొలి ప్రయత్నంగా ప్రొఫెషనల్స్ చేత కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈనెల 25 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7093081073,9110388060 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పడకేసిన సంక్షేమం

పేద విద్యార్థుల 'వసతి'కి చెదలు పట్టింది. అధికారుల అవినీతి దాహానికి.. పాలకుల నిర్లక్ష్య వైఖరికి ప్రభుత్వ హాస్టళ్లు సమస్యల్లో చిక్కుకుపోయాయి. ఫలితంగా పేద పిల్లలు విద్యావంతులుగా ఎదగడానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ వసతి గృహాలకంటే కారాగారాలే నయం అనేలా పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని ఆయా హాస్టళ్లలో 'సాక్షి' పరిశీలనలో చేదు నిజాలు వెలుగుచూశాయి.

- ఇంకా బహిర్భూమికి ఆరు బయటకే
- కప్పుకొనే దుప్పటి..తినే కంచానికీ కరువే
- విద్యార్థుల్లో ప్రతిభ పుష్కలం.. కరువైన పాలకుల ప్రోత్సాహం
- సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు



కడప నగరం శంకరాపురంలోని ఎస్సీ-3 హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కప్పుకునే దుప్పటి మొదలు తినే కంచం దాకా కరువే అన్నట్లు పరిస్థితి తయారైంది. ఇక బహిర్భూమికి ఇప్పటికీ ఆరుబైటకే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు ఆయా హాస్టళ్లలో సమస్యలతో సావాసం చేస్తూనే చదువుకుంటున్నారు. వారి విద్యాభివృద్ధి కి 'వసతి సౌకర్యాలు' పెను సమస్యగా మారాయి.

ప్రభుత్వం చిన్నచూపు

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు దాటింది. ఇటీవల రెండు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులు వచ్చాయి. ఇంకా మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు రావాల్సి ఉంది. దీని ప్రభావం విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై పడింది. ఫలితంగా చాలా హాస్టళ్లలో 'మెను'దారి తప్పింది. ఈ క్రమంలో గుడ్డు తదితర ఆహారపదార్థాలు విద్యార్థులకు అందడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు దాటినా బీసీ, ఎస్సీ వసతి గృహాల్లోని ప్రీ మెట్రిక్ (3 నుంచి 10వ తరగతి) విద్యార్థులకు ఇప్పటివరకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు అందలేదు. వీటిని ఏడాదికి ఒకసారి విద్యా సంవత్సరం ప్రారంభమైన కొద్ది రోజులకే ఇవ్వాలి. వర్షాకాలం ముగిసింది, చలికాలం ప్రారంభమైంది. ఇంతవరకు విద్యార్థులకు దుప్పట్లు అందలేదు. ఇక ఉన్న ప్లేట్లు, గ్లాసులతోనే సర్దుబాటు చేసుకుంటున్నారు.

జిల్లాలోని హాస్టళ్ల వివరాలు

శాఖ విభాగం	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ ప్రీ మెట్రిక్	53	5,243
పోస్ట్ మెట్రిక్	14	1,610
బీసీ ప్రీ మెట్రిక్	31	2,194
పోస్ట్ మెట్రిక్	14	1,027
ఎస్టీ ప్రీ మెట్రిక్	01	150
పోస్ట్ మెట్రిక్	02	250
రెసిడెన్షియల్	05	604



కమలాపురంలో అధ్వానంగా హాస్టల్ మరుగుదొడ్లు



బద్వేలు అర్బన్: శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతిగృహం పైకప్పు



కలసపాడు బాలుర వసతిగృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు



ప్రొద్దుటూరు: మోడంపల్లె ఎస్సీ హాస్టల్‌లో తొలగించిన కాంపౌండ్‌వాల్

డైట్ బిల్లులు అందకపోవడంతో ఇబ్బందులు



హెచ్‌డబ్ల్యూఓ (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్)కు సక్రమంగా డైట్ బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డైట్ బిల్లులను సక్రమంగా అందించాలి. ప్రస్తుతం సరుకుల ధరలు పెరిగినందున అందుకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచాలి. టెండర్ల ద్వారా సరుకులను సరఫరా చేస్తే బాగుంటుంది.

– రామలింగారెడ్డి, అధ్యక్షుడు, జిల్లా బీసీ హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్

హాస్టళ్లను గాలికొదిలేసిన ప్రభుత్వం



ప్రభుత్వ ఎస్సీ, బీసీ, ఎస్టీ హాస్టళ్లలో సమస్యలు అధికంగా ఉన్నాయి. బీసీ, ఎస్సీ హాస్టళ్లు చాలా వరకు కాలపరిమితి దాటిన అద్దె భవనాల్లో సాగుతున్నాయి. డైట్ బిల్లులను పెంచాలి. హాస్టల్ విద్యార్థుల కంటే ఖైదీలకు ఇచ్చే డైట్ బిల్లులు మెరుగ్గా ఉన్నాయి. ప్రభుత్వ హాస్టళ్ల పరిరక్షణను పాలకులు గాలికొదిలేశారు.

– గుజ్జుల వలరాజు, జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్.

ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతికి కృషి



ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. విజయరామరాజు కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఎస్సీ హాస్టళ్లలో రూ.6 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టాం. ఆయన హయాంలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం.

– కె.సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ



చెన్నూరు హాస్టల్‌లో భోజనానికి క్యూలో నిలబడిన విద్యార్థులు



అట్లూరు: రాత్రివేళ విద్యార్థులు ఇళ్లకు వెళ్లడంతో ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్



బద్వేలు అర్బన్: ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకున్న విద్యార్థులు

దుర్భర పరిస్థితులు...



పులివెందులలోని గురుకులంలో పగిలిన తరగతి గది తలుపు

- జిల్లా కేంద్రమైన కడప ప్రకాశ్‌నగర్‌లోని బీసీ కళాశాల హాస్టల్‌లో ఇంటర్మీడియేట్, ఆపైన చదివే విద్యార్థులు దాదాపు 130 మందికి పైగా ఉన్నారు. ఇక్కడ సరిపడా మరుగుదొడ్లు లేవు. అదే సందర్భంలో ఉన్న వాటికి తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. కాగా, పట్ట పగలే హాస్టల్‌లోని గదులు కారుచీకట్లు కమ్ముకున్న విధంగా ఉన్నాయి. కొన్నిమార్లు భోజనం సక్రమంగా ఉండదనే అభిప్రాయాన్ని పలువురు విద్యార్థులు వ్యక్తం చేశారు. టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న ఎస్సీ నెంబరు-3 బాలుర హాస్టల్‌లో సరిపడ స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట స్నానం చేస్తున్నారు.
- జమ్మలమడుగు బీసీ బాలికల హాస్టల్‌లో కిటికీలు లేకపోవడంతో వాటికి కర్టెన్లుగా బట్టలు కప్పారు. చెదలు కారణంగా కిటికీలు దెబ్బతినడంతో వాటిని అధికారులు పట్టించుకోలేదు. కనీసం బాలికలు అన్న స్పృహ కూడా లేకపోవడం శోచనీయం. అలాగే బీసీ కళాశాల హాస్టల్ ప్రైవేటు భవనంలో నడుస్తోంది. ఎర్రగుంట్లలో హాస్టల్ లేకపోవడంతో పేద విద్యార్థులు వసతి కోసం ఇబ్బందులు పడుతున్నారు.
- బద్వేలులో 40 ఏళ్ల కిందట నిర్మించిన బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరింది. ఇందులో చాలా గదులు మూతపడ్డాయి. ఇక్కడున్న 97 మంది బాలురు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడే ఉన్న మరో ఎస్సీ బాలుర, బీసీ బాలికల కళాశాల హాస్టళ్లు అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అట్లూరు బీసీ హాస్టల్‌లో రిజిస్టర్‌లో 58 మంది ఉంటే, అక్కడ 21 మంది ఉన్నారు. సోమవారం రాత్రి విద్యార్థులకు ఆహారంలో గుడ్డును ఇవ్వలేదు. పోరుమామిళ్ల ఎస్సీ బాలుర హాస్టల్‌లో 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరింది. బి.కోడూరులోని బీసీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమికి ఆరుబయటకి వెళుతున్నారు. కాశినాయన మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ప్రైవేటు భవనంలో నడుస్తోంది. ఇందులో 100 మంది విద్యార్థులు ఉంటే ఒక మరుగుదొడ్డి, ఒక బాత్‌రూము మాత్రమే ఉంది. ప్రొద్దుటూరులోని పొట్టిపాడు రోడ్డులోగల ఎస్సీ బాయిస్ హాస్టల్‌లోనే కళాశాల హాస్టల్ కూడా నడుస్తోంది. ఇక్కడ నీటి కొరత సమస్యగా ఉంది. మోడెంపల్లె ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్రహరీ పడగొట్టడంతో రక్షణ లేకుండా పోయింది.
- పులివెందులలోని నల్లపురెడ్డిపల్లె బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల సమస్య ఉంది. మైదుకూరు పరిధికి సంబంధించి ఖాజీపేటలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లలో మరుగుదొడ్ల సమస్య అధికంగా ఉంది. అలాగే కమలాపురానికి సంబంధించి బీసీ బాలుర కళాశాల హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ కూడా కనీస సౌకర్యాలు లేవు.

'ఉపాధి' కింద రహదారుల నిర్మాణం

- పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి



పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తున్న అబ్జర్వర్ ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటురోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో రాయచోటి, రాజంపేట, కోడూరు, కమలాపురం, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఆర్ఆర్‌పీ అబ్జర్వర్లు కె.ప్రభాకర్‌రెడ్డి, వై.నరసింహారావు నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం ఎలా చేపట్టాలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో 205 రోడ్డు పనులను రూ. 1235.28 లక్షలతో చేపడుతున్నామన్నారు. కమలాపురం నియోజకవర్గంలో 282 రోడ్డు పనులను రూ.1630 లక్షలతో చేపడుతున్నామని వెల్లడించారు. బద్వేలు నియోజకవర్గంలో 213 పనులను రూ. 1406 లక్షలతో, పులివెందుల నియోజకవర్గంలో 91 రోడ్లను రూ. 525.04 లక్షలతో, జమ్మలమడుగు నియోజకవర్గంలో 130 రోడ్లను రూ.1934.35 లక్షలతో, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 77 పనులను రూ. 850.04 లక్షలతో చేపడతామన్నారు. గ్రామసభల ద్వారా వెండార్స్‌ను ఎంపిక చేసి పనులను అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఉరుసు







పెద్ద దర్గా లో సోమవారం అర్థ రాత్రి జరిగిన ఫకీర్ల విన్యాసాలు చూసేందుకు హాజరైన ప్రజలు... ఫకీర్ల విన్యాసాలు

దర్గాలో ప్రముఖుల ప్రార్థనలు

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప పెద్దదర్గాలో ఉరుసు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కూడా భక్తుల కోలాహలంతో దర్గా ప్రాంతం సందడిగా కనిపించింది. దర్గాలోని ప్రధాన గురువుల మజార్ల వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రముఖుల ప్రార్థనలు

ఉత్సవాల సందర్భంగా గురువులను దర్శించుకోవాలని పలువురు ప్రముఖులు విచ్చేశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబుతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా దర్గాకు చేరుకుని ప్రార్థనలు చేపట్టారు. దేశం నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు నిరాడంబరంగా దర్గాకు విచ్చేసి గురువుల దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఇక ఇతర ప్రాంతాల నుంచి ఉత్సవాలకు భక్తులు వస్తూనే ఉన్నారు. కాగా దర్గా ఆవరణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్లతో పాటు ఆస్తానా ఫకీర్లు చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పీఠాధిపతి, ఇతర భక్త ప్రముఖులు గండి వాటర్ వర్క్స్ వద్దగల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, జెండాను ప్రతిష్ఠించి అన్నదానం చేస్తారు. అలాగే రాత్రి 10 గంటలకు స్థానిక మైఅల్లా దర్గా నుంచి పీఠాధిపతి నగరోత్సవం ప్రారంభం కానుంది.



పెద్ద దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా, పార్టీ నేతలు

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: ఆకాంక్ష జిల్లాల (ఆస్పిరేషన్ డిస్ట్రిక్ట్స్) ఆశయాలకు అనుగుణంగా అధికారులు జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ బోర్డు రూమ్ హాలు నుంచి కలెక్టర్ అధ్యక్షతన 'ఆకాంక్ష జిల్లాల ఆశయసాధనలో భాగంగా జిల్లాలో కార్యాచరణ, ప్రగతి'పై సంబందిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'నీతి ఆయోగ్' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. ఇందులో మన జిల్లా కూడా ఉందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని(అభివృద్ధి) ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అందుకోసం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సంతృప్త స్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు సాధించిన ప్రగతి ఆధారంగా ప్రోత్సాహకాలను కూడా భారీ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆ మేరకు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అన్ని శాఖల పరిధిలో కొరత ఉన్న సౌకర్యాలు, సదుపాయాలు, అవసరాలను ఎప్పటికప్పుడు సంపూర్తి చేయాలన్నారు.

- ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నాగరాజు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్,ఐసిడిఎస్ అధికారిని శ్రీలక్ష్మి, సీపీఓ వెంకటరావు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు జనార్ధన్, ఏపీఎంఐపి పీడీ వెంకటేశ్వర రెడ్డి,తదితర అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాల్‌లో అంగన్వాడి కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం, నీటి వసతి ల పై ఐసీడీఎస్, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మా ణాలు డిసెంబర్ 31 లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లి రోడ్డులో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కొక్కరాయపల్లి నుంచి చెన్నూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన రామాంజనేయులును గ్రీన్ కో పవర్ ప్లాంట్ గేటు వద్ద చెన్నూరు నుండి కొక్కరాయపల్లె వైపు వస్తున్న ఆటో బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధురాలు

వేంపల్లె : చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలు మంగళవారం మృతి చెందిందని ఆర్కే వ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చక్రాయపేట మండలం గండి క్షేత్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గుర్తు తెలియని వృద్ధురాలు శనివారం రాత్రి 8 గంటల సమయంలో ప్రదర్శనలు చేస్తుండగా ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో ఆమె కింద పడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆ వృద్ధురాలిని వేంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

- ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులు పెడతారా?
- ప్రభుత్వాలు శాశ్వతం కాదు.. ప్రజలు శాశ్వతం
- పోలీసులు నిజానిజాలు తెలుసుకోకుండా అరెస్ట్ చేయడం భావ్యం కాదు
- రిమాండ్‌లో వున్న వర్రా రవీంద్రారెడ్డిని పరామర్శించిన వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్ బాషా



కడప కేంద్ర కారాగారంలో వర్రా రవీంద్రారెడ్డిని పరామర్శించి వస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషా, నాయకులు

కడప అర్బన్ : రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోంది. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషా అన్నారు. మంగళవారం సాయంత్రం కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో వున్న వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డిని వైఎస్ఆర్‌సీపీ నాయకులు పరామర్శించారు. అనంతరం మీడియాతో రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా వైఎస్ఆర్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం తప్పులను ప్రశ్నిస్తే కేసులను పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా భయపెట్టేందుకు వైఎస్ఆర్‌సీపీ నేతలపై అక్రమ కేసులను అన్యాయంగా పెడుతున్నారన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదు, ప్రజలు శాశ్వతమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు నిజానిజాలు తెలుసుకోకుండా అరెస్ట్ చేయడం భావ్యం కాదన్నారు. టీడీపీ నేతలు చెప్పినట్లే పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రారెడ్డి 2021లో సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ఐటిడిపి టీంకు సంబంధించిన వారు పోస్టులు పెట్టారనీ, అదే సాకుగా తీసుకుని అక్రమ కేసులను పెట్టారన్నారు. ఈక్రమంలోనే వర్రా రవీంద్రారెడ్డికి ఓ కేసులో 41ఏ నోటీసును ఇచ్చి, మరో ఎస్సీ, ఎస్టీ కేసును బనాయించి, ఇంకా సెక్షన్‌లను పెట్టి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. వర్రా రవీంద్రారెడ్డితో పాటు ప్రతి సోషల్ మీడియా యాక్టివిస్టులకు, సానుభూతిపరులకు వైఎస్ఆర్‌సీపీ అండగా వుంటుందన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులపై అక్రమ కేసులను పెట్టిన అధికారులు జాగ్రత్తగా వుండాలన్నారు. అలాంటి వారికి ఖచ్చితంగా అంతకు పదిరెట్లు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో డైవర్షన్ పాలన జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వైఎస్ఆర్‌సీపీకి ఓట్లు వేసిన వారిపై, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై, సానుభూతిపరులపై కక్షసాధింపు చర్యలలో భాగంగా కేసులను బనాయించి అక్రమంగా అరెస్ట్‌లు చేస్తున్నారన్నారు. జమిలి ఎన్నికలు వస్తే వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తుందని, అపుడు కక్షసాధింపు చర్యలకు పాల్పడిన అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, వైఎస్ఆర్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్‌కుమార్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు షఫీ, వైఎస్ఆర్‌సీపీ ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షుడు సీహెచ్ ఇలియాస్, కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, నాయకులు దాసరి శివ, రాయల్ బాబు, షఫీ, వైఎస్ఆర్‌సీపీ 3వ డివిజన్ ఇన్‌ఛార్జ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలకు పరామర్శ

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నియోజక వర్గ పరిధిలో పెద్దశెట్టిపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లేట్లపల్లి శివరాం, లేట్లపల్లె రామాంజనేయులుపై పోలీసులు ఇటీవల అక్రమ కేసును బనాయించి కడప కేంద్రకారాగారానికి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్‌లో వున్న వీరితో పాటు, మైదుకూరులోని సర్వరాయపల్లెకు చెందిన ఓ హత్య కేసులో జీవితఖైదు విధించబడిన 13 మందిని మంగళవారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకుడు, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యెం వెంకటసుబ్బారెడ్డిలు పరామర్శించారు. ఇంకా వీరితో పాటు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ శ్రీమన్నారాయణ, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, ఖాజీపేట మండలం వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఓబయ్యయాదవ్, శివాల్‌పల్లె మాజీ సర్పంచ్ శివయ్యయాదవ్ ఉన్నారు.

పలు రైలు నంబర్లలో మార్పులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పలు రైలు నంబర్లలో మార్పులు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా విశాఖ-కడప, విశాఖ-గుంటూరు, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ రైళ్ల నంబర్లను మార్పు చేశారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రస్తుత నంబరు	మార్పుచేసిన నంబరు	ఎక్కడి నుంచి ఎక్కడికి	కొత్త నంబరు అమలులోకి వచ్చేది
17488	18521	విశాఖపట్టణం-కడప	1.03.2025
17487	18522	కడప-విశాఖపట్టణం	1.03.2025
22701	22875	విశాఖపట్టణం-గుంటూరు	1.03.2025
22702	22876	గుంటూరు-విశాఖపట్టణం	1.03.2025
20896	20895	భువనేశ్వర్-రామేశ్వరం	7.03.2025
20895	20896	రామేశ్వరం-భువనేశ్వర్	9.03.2025
12898	12897	భువనేశ్వర్-పాండిచ్చేరి	4.03.2025
12897	12898	పాండిచ్చేరి-భువనేశ్వర్	5.04.2025
12830	12829	భువనేశ్వర్-చెన్నై సెంట్రల్	6.03.2025
12829	12830	చెన్నై సెంట్రల్-భువనేశ్వర్	7.03.2025

పంటల బీమా చెల్లింపు ప్రక్రియ ప్రారంభం

- డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

రైతు వాటా ప్రీమియం వివరాలు ఇలా..	
పంట	ఎకరాకు చెల్లించాల్సింది రూపాయల్లో
వరి	638
శనగ	486
వేరుశనగ	486
జొన్న	319
పెసలు	273
మినుములు	288
నువ్వులు	182
సన్‌ఫ్లవర్	304

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పంటల బీమా పథకం రబీ 2024-25 సంవత్సరానికి పంటల వారిగా ప్రీమియం చెల్లింపు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రీమియం చెల్లింపునకు పంట రుణగ్రహీతలు నేరుగా బ్యాంకు ద్వారా మాత్రమే చెల్లింపు జరపాలన్నారు. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేరుగా ప్రీమియం చెల్లించాలన్నారు. నేరుగా ప్రీమియం చెల్లించు రైతులు ఆధార్, బ్యాంకు పాస్ బుక్, పట్టదారు పాసుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్ వివరాలను జతపరుస్తూ కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేదంటే రైతులే స్వయంగా ఎన్‌సిఐపి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రీమియం డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించాలని ఆయన సూచించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

బద్వేలు అర్బన్ : బద్వేలు – కడప రహదారిలోని కొంగలవీడు క్రాస్ వద్ద 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేయడంతో పాటు ఒక టాటాగూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్ అలీ పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు బంగ్లా ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కొంగలవీడు క్రాస్ రోడ్డు వద్ద ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. కర్ణాటక రాష్ట్రం కటిగినహల్లికి చెందిన సయ్యద్‌ముబారక్ వాహనంలో దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ రెండు భాగాలుగా విడిపోయింది. పట్టణంలోని సుమిత్రానగర్‌కు చెందిన నరసింహులు తెల్లవారుజామున తన ట్రాక్టర్‌లో వస్తుండగా నాలుగు రోడ్ల కూడలి వద్దకు వచ్చేసరికి నెల్లూరు నుండి బళ్ళారికి బొగ్గు లోడుతో వెళుతున్న లారీ వేగంగా ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్ భాగం రెండు ముక్కలుగా విరిగిపోయింది. ప్రమాదం తెల్లవారుజామున జరిగిన నేపథ్యంలో జనసంచారం తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ విభాగం స్విమ్మింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి ప్రారంభించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 7, 8 తేదీల్లో విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్‌లు రాజేంద్ర, ధనుంజయరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

బాలుర విభాగం : యశ్వంత్, కార్తికేయదేవ రాయల్, నాగవర్ధన్, జ్ఞాన అఖిలేష్, లక్ష్మినారాయణ, త్రిభువన్‌రెడ్డి, మాధవ, షణ్ముఖ్, శ్రీవెంకటసాయి, వెంకటశ్రీరామ్, ఆదిశేషారెడ్డి.

బాలికల విభాగం : మోక్షప్రియ, ఎస్. ఆల్ అమీన్.

కార్మికుల హక్కులను నిర్వీర్యం చేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్మిక వర్గంపై దాడులు చేస్తూ, కార్మిక హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసి. బాదుల్లా, ఉపాధ్యక్షులు మంజుల, చాంద్ బాషా కార్యదర్శులు మద్దిలేటి, శ్రీరాములు అనుబంధం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ నిధులు దుర్వినియోగం వ్యవహారానికి సంబంధించి గోపవరం మాజీ సర్పంచ్ కే దేవీప్రసాద్‌రెడ్డిపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూ.61.36 లక్షల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం వ్యవహారంలో రకవరి చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని లోకాయుక్త ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీఎల్‌పీఓ తిమ్మక్క రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవీప్రసాద్‌రెడ్డి సర్పంచ్‌గా పని చేసిన కాలంలో 13,14 ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగం చేసినట్లు డీఎల్‌పీఓ ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పందిని ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం

తొండూరు : మండల పరిధిలోని గంగనపల్లె గ్రామానికి చెందిన నల్లమేకల శివ కుమార్ అనే వ్యక్తి పులివెందులకు మంగళవారం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు పంది అడ్డు రావడంతో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హుటాహుటిన 108 వాహనంలో పులివెందులలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి అతడిని తరలించారు. తొండూరు ఎస్ఐ పెద్ద ఓబన్న కేసు నమోదు చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వ్యక్తిని పరామర్శించారు.

మహిళ అదృశ్యం



గాలి అశ్వని (ఫైల్)

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామానికి చెందిన గాలి అశ్విని (24) అనే మహిళ అదృశ్యమైందని ఆమె భర్త గాలి సూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలమల్ల ఎస్ఐ తిమోతి మంగళవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన భర్త గాలి సూరి కూలి పనుల నిమిత్తం వెళ్లగా సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తన భార్య కనిపించలేదు. బంధువుల ఇళ్లలో, తెలిసిన వారి ఇళ్లలో విచారణ చేయగా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం కలమల్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

ఇందిరకు నివాళులు



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దివంగత ఇందిరాగాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తన పర్యటనలో భాగంగా ఆమె పెద్దదర్గాను సందర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయ జ్యోతి, నాయకులు అఫ్జల్ ఖాన్, ధృవ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఇటీవల కొన్ని రాజకీయ పార్టీల నేతలు మాదిగల మధ్యన చిచ్చుపెట్టే కుట్ర పన్నుతున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ విమర్శించారు. మంగళవారం ఆయన సింహాద్రిపురంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బలపనూరు ఎస్సీ కాలనీలో ఉన్న ఎం.భార్గవ, తండ్రి ఎం.వెంకటరమణపై అగ్రవర్ణాల వారు దాడి చేశారని, అప్పట్లో వారిపైన సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. దాడి చేసిన గజ్జల చంద్రశేఖర్ రెడ్డికి అనుచరుడుగా ఉన్న ఎల్లయ్యగారి చిన్న ఓబయ్య గత కొన్నేళ్లుగా పులివెందులలో నివాసముంటున్న రామయ్యగారి కృష్ణమూర్తిపై దాడి చేశారు. ఇటీవల మళ్లీ పెళ్లి సందర్భంగా బలపనూరుకు వచ్చిన కృష్ణమూర్తిపై ఎల్లయ్య గారి చిన్న ఓబయ్య దాడి చేయడం వెనుక గజ్జల చంద్రశేఖర్ రెడ్డి హస్తం ఉందన్నారు. పోలీస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు చర్మ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ కె.నాగభూషణం మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య గారి కృష్ణమూర్తి, తుమ్మలపల్లి సూర్యనారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

'సీమ'లోని సంస్థలను తరలిస్తే ఉద్యమిస్తాం

సీపీఐ, ఆర్‌సీపీ నేతల హెచ్చరిక

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమలో ఏర్పాటైన వివిధ సంస్థలను అమరావతికి తరలించాలని చూస్తే సీమలోని అన్ని పార్టీల, ప్రజాసంఘాల ప్రతినిధులను ఐక్యం చేసి ప్రత్యక్షంగా ఉద్యమిస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. అరకొర పరిశ్రమలు, సంస్థలను రాయలసీమలో నెలకొల్పితే, కూటమి ప్రభుత్వం వాటిని అమరావతికి తరలించుకుపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కడప శివార్లలోని కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించడానికి జీఓ తీసుకు వచ్చారని, కర్నూలు లో మానవ హక్కుల, లోకాయుక్త కార్యాలయం, సీబీఐ కోర్టు, బ్యాంకుల విలీనం పేరుతో కడపలోని ఆంధ్ర గ్రామీణ ప్రగతి బ్యాంక్ అమరావతికి తరలించాలని చూస్తున్నారని వారు మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన కాలం నుంచి ఒక నంద్యాల రైలు మార్గం తప్ప మరొక రైలు మార్గం అంటే తెలియని స్థితిలో సీమ వాసులు ఉన్నారన్నారు. పాలకులకు సీమ నీటి ప్రాజెక్టుల మాటే పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్‌బాష, లోక్‌సత్తా, జనతాదళ్ నాయకులు ప్రతాప్ రెడ్డి, కృష్ణయ్య, విద్యుత్ రిటైర్డ్ నాయకులు గుర్రప్ప, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటేష్, మడగలం ప్రసాద్, రమేష్, ఓబులేసు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన దృశ్యం

ఖాజీపేట : ప్రతి రోజు మనకోసం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, వారిని సత్కరించడం సంతోషకరం అని జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ అన్నారు. ప్రపంచ పారిశుద్ధ్య కార్మికుల దినోత్సవం సందర్భంగా ఖాజీపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఖాజీపేట మేజర్ పంచాయితీలో పనిచేస్తున్న కార్మికుల తో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజా సంపతి, పంచాయితీ కార్యదర్శి రమణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులొదిలేసి వెళ్లకపోతే ప్రాణాలుండవ్

- ఎంపీ రమేష్ కాంట్రాక్ట్ సంస్థకు ఎమ్మెల్యే ఆది వర్గీయుల బెదిరింపు
- రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సైట్ ఇంజనీర్లపై దాడి
- దొబ్బుడుపల్లె వద్ద రూ.1,800 కోట్లతో ఆదానీ హైడ్రో పవర్ ప్లాంట్
- నిర్మాణ పనులు చేస్తున్న ఎంపీ వర్గీయులు
- ఆ పనులు తామే చేపట్టాలంటూ ఎమ్మెల్యే ఆది వర్గీయుల హుకుం
- వంద వాహనాలల్లో వెళ్లి సిబ్బందిపై దాడి, వాహనాలు ధ్వంసం



ఎమ్మెల్యే ఆది



ఎంపీ రమేష్ నాయుడు

సాక్షి ప్రతినిధి, కడప : అనకాపల్లి బీజేపీ ఎంపీ రమేష్ నాయుడుకు చెందిన రిత్విక్ కాంట్రాక్టు సంస్థ పనులను అదే పార్టీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. తక్షణమే పనులు వదిలేసి వెళ్లాలని, లేదంటే ప్రాణాలు దక్కవంటూ సైట్ ఇంజనీర్లపై దాడి చేశారు. యంత్ర సామగ్రిని ధ్వంసం చేశారు. వైఎస్సార్ జిల్లాలోని గండికోట ప్రాజెక్టు ఆధారంగా వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది.

కొండాపురం మండలం దొబ్బుడుపల్లె, రావికుంట, తిరువాలయపల్లె గ్రామాలతోపాటు మైలవరం మండలం బొగ్గులపల్లె పరిధిలో 250 ఎకరాలు ప్రభుత్వ భూమి, 150 ఎకరాల ఫారెస్టు భూమిలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. తొలి విడతగా రూ.1,800 కోట్లతో నిర్మాణ సంస్థ పనులకు శ్రీకారం చుట్టింది. టెండర్లలో అనకాపల్లె ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ సంస్థకు పనులు దక్కాయి. క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టింది. ఈ వ్యవహారం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులకు నచ్చలేదు. ఆ పనులు తామే చేయాలంటూ పట్టుబట్టారు. ఆ మేరకు ఎమ్మెల్యే ఆది.. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను ఇటీవల సందర్శించి, స్థానికుల సమస్యలు పరిష్కారించాలంటూనే.. నిర్మాణ పనులు తమ వర్గీయులకు అప్పగించాలని కోరినట్లు సమాచారం. ఈ మేరకు కొన్ని పనులు ఆది వర్గీయులకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా, మొత్తం పనులన్నీ తమ వర్గీయులకే దక్కాలని, అప్పుడే ప్రాజెక్టు పనులు కొనసాగుతాయని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇవేవి పరిగణనలోకి తీసుకోకుండా రిత్విక్ సంస్థ నిర్మాణ పనులు కొనసాగిస్తుండగా మంగళవారం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున దొబ్బుడుపల్లె వెళ్లి విధ్వంసం సృష్టించారు.

తక్షణమే ఖాళీ చేసి వెళ్లిపోండి..

కొండాపురం, మైలవరం మండలాలకు చెందిన ఎమ్మెల్యే ఆది వర్గీయులు దేవగుడి శివ నారాయణ రెడ్డి, రాజేష్‌రెడ్డిల నేతృత్వంలో మంగళవారం వంద వాహనాలకుపైగా అనుచరులతో దొబ్బుడుపల్లె ప్రాంతానికి వెళ్లారు. రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సైట్ ఇంజనీర్లపై దాడి చేశారు. యంత్రాలను ధ్వంసం చేశారు. ఇక్కడి నుంచి తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు. కాదు, కూడదని పనులు చేస్తే ప్రాణాలతో ఉండరంటూ తీవ్రస్థాయిలో బెదిరించారు. తాము కూడా జమ్మలమడుగు నియోజకవర్గ వాసులమే అని చెప్పుకొచ్చినా.. 'ఎక్కడ పోట్లదుర్తి, ఎక్కడ కొండాపురం.. మేమంతా చచ్చాం అనుకుంటున్నారా? పనులంటూ చేస్తే మేమే చేయాలి? లేదంటే లేదు. మళ్లీ ఇక్కడ పనులు కొనసాగితే జాగ్రత్త' అంటూ విరుచుకుపడ్డారు. కాగా, ఈ విషయం తెలిసినప్పటికీ ఎంపీ రమేష్‌నాయుడు సోదరుడు సురేష్‌నాయుడు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని సమాచారం. ఈ ఘటనపై ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.